## క్లుప్తంగా

### వివాహితకు ఆశ్రయం



వివాహితను షెల్టర్ నిర్వాహకుడు ప్రగడ వాసుకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ గాయత్రి

**అల్లిపురం:** కాకినాడకు చెందిన వివాహిత వానపల్లి జ్యోతిశ్రీ (27) భర్త హింస భరించలేక ఇల్లు వదిలి విశాఖ చేరుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భర్త రోజూ కొడుతుండడంతో ఇల్లు వదిలి పుట్టింటికి వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి అత్తవారి ఇంటికి పంపించారు. అయితే అత్తగారే చాడీలు చెబుతూ, కొడుకుతో కలిసి చిత్ర హింసలు పెడుతుండటంతో ఆమె తట్టుకోలేక ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. ఒంటరిగా మహారాణి పేట రోడ్ల మీద తిరుగుతూ ఉండగా లేడీ కానిస్టేబుల్ గాయత్రి ఆమెను చూసి వివరాలు తెలుసుకుంది. ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్‌కు తీసుకెళ్లింది. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో జీవీఎంసీ మహిళల వసతి గృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

### రూ.1120 కోట్ల నిధుల విడుదలకు వినతి

**డాబాగార్డెన్స్:** కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి పంపాల్సిన రెండో విడత రూ.1120 కోట్ల నిధులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైబీవీ రాజేంద్రప్రసాద్ కోరారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులు రూ.వెయ్యి కోట్లు సర్పంచుల ఖాతాల్లో జమ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడతగా కేంద్రం పంపిన రూ. 991 కోట్లను కూడా సర్పంచుల ఖాతాల్లో జమ చేశారన్నారు. జరిగిందన్నారు. సమావేశంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి, ముత్యాలరావు, చింతకాయల ముత్యాలు, వానపల్లి ముత్యాలరావు, చుక్కా ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైభవుడికి సుప్రభాత సేవ



**మురళీనగర్:** కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, ఉదయం 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

### ప్రైవేటు క్యాంటీన్ల తొలగింపు ప్రారంభం

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటు క్యాంటీన్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వుల మేరకు షాపులను తక్షణం మూసి వేసి ప్లాంట్ ప్రాంగణం వదలి వెళ్లాలని ఆయా షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటు క్యాంటీన్లు, పాన్‌షాపులు, జ్యూస్ షాపులు సుమారు 70 ఉన్నట్టు యాజమాన్యం గుర్తించింది. అదే విధంగా గతంలో క్యాంటీన్ నిర్వహించి ప్రస్తుతం మూతపడినవి సుమారు 20 ఉన్నాయి. మొదటి దశలో మూతపడిన క్యాంటీన్ల షెడ్ల తొలగింపు పనులు గురువారం సాయంత్రం ప్రారంభించారు.ఇవి పూర్తయిన తర్వాత ప్రస్తుతం నడుస్తున్న క్యాంటీన్లపై యాజమాన్యం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

### ఈఎల్ పునరుద్ధరణకు వినతి

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఆర్జిత సెలవులు (ఈఎల్) ఎన్‌క్యాష్‌మెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎండీకి వినతి పత్రం అందజేశారు. ఈఎల్ పై ఆధారపడి పిల్లల ఫీజులు చెల్లించుకునే వారని పేర్కొన్నారు. ఉద్యోగుల పరిస్థితి అర్థం చేసుకుని లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పునరుద్ధరించాలన్నారు. అధికారులకు 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం ఉండగా కార్మికులకు 200 లీవులు మాత్రమే పొదుపు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్మికులు లీవులు కోల్పోకుండా 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం కల్పించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ తదితరులు కోరారు.

# ఆధ్యాత్మిక శోభ

- దక్షిణలో శ్రావణ శుక్రవారం పూజల సందడి
- కళకళలాడిన ఆలయాలు
- తెల్లవారు జాము నుంచే పూజల్లో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక పూజల్లో కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారు



ప్రత్యేక పూజల్లో నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న ఉభయదాతలు

**డాబాగార్డెన్స్:** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నియోజకవర్గంలో పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. కనకమహాలక్ష్మి అమ్మవారు శ్రావణ శుక్రవారం సందర్భంగా స్వర్ణాభరణాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానంలో వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు.

**పట్టు వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి..**

నగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి మూల విరాట్‌కు వేకువ జాము 5 గంటలకు 108 ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక నివేదన అనంతరం, పట్టు వస్త్రాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. దేవస్థాన ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమారశర్మచే 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, ఉత్సవ కార్యనిర్వాహక సభ్యులు కడిమిశెట్టి దంతేశ్వరి, పాలూరి స్వర్ణలత, పూసర్ల అనిత, దేవాలయ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బాదం నాగ వెంకట కమలశ్రీ, సహాయ కార్యదర్శి కట్టమూర్తి ప్రసన్న, కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**అమ్మవారికి క్షీరాభిషేక సేవ**

అమ్మవారి మూలవిరాట్‌కు ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవ ఉదయం 7 నుంచి 8 వరకు జరిగింది. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514 నంబరులో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**అల్లిపురం:** శ్రావణ శుక్రవారం సందర్భంగా అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, వెంకటేశ్వరమెట్టలోని అలివేలు మంగమ్మ ఆలయం, బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండా చెట్టు వీధిలోని విజయ దుర్గాలమ్మ ఆలయం, యారాడ కొండపై వెలసిన సాగర దుర్గ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, అర్చనలు జరిగాయి. ప్రతి ఇంట్లో మహిళలు అమ్మవారిని వారి శక్తి కొద్దీ పూజించి పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు. మహిళలకు వాయినాలు ఇస్తూ సందడి వాతావరణంలో వ్రతం చేసుకున్నారు.



వరలక్ష్మీ పూజల్లో కనకదుర్గమ్మ అమ్మవారు



వరలక్ష్మీ పూజల్లో జెండాచెట్టు వీధిలో వెలసిన విజయదుర్గాలమ్మ అమ్మవారు



ప్రత్యేక పూజల్లో ఉమాదేవి అమ్మవారు



విజయదుర్గాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

## తుంగభద్ర వారియర్స్ జెర్సీ ఆవిష్కరణ



కొత్త జెర్సీతో తుంగభద్ర వారియర్స్

**డాబాగార్డెన్స్:** ఏపీఎల్ సీజన్–4లో ఆడనున్న 'తుంగభద్ర వారియర్స్' క్రికెట్ టీం జెర్సీని శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగభద్ర వారియర్స్ ప్రతినిధి శేషకుమార్ మాట్లాడుతూ తుంగభద్ర టీం అనేది ఏపీఎల్‌లో ఆడే ఓ జట్టని, శేషుకుమార్, సిద్ధార్థ మురకొండ లీడ్ చేస్తున్నారని, స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ టీం ఆడుతుందన్నారు. ఈ నెల 23 వరకు 7 టీమ్‌లతో ఆడనుందని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ ఏజీ ప్రదీప్, కెప్టెన్ మహీప్‌కుమార్, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీ నోట్ల అలంకరణలో నూకాంబిక



కరెన్సీ నోట్లతో అలంకరించిన అమ్మవారు

**ఆరిలోవ:** జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం దరి వెటర్నరీ కాలనీలోని రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇక్కడ అమ్మవారిని కరెన్సీ నోట్లు, మట్టి గాజులతో అలంకరించారు. వెటర్నరీ కాలనీ, ఇందిరానగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## ప్రజల్ని మోసగించిన బాబు

31వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



31వ వార్డులో ప్రజలకు బాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**డాబాగార్డెన్స్:** సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజల్ని మోసం చేస్తున్నారంటూ జీవీఎంసీ 31వ వార్డులో ఆ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ విమర్శించారు. ఆయన నేతృత్వంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం చేపట్టారు. వార్డు పరిధి వెంకటేశ్వర థియేటర్ ఏరియా, గంగుల గెడ్డ తదితర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అబద్ధపు హామీ గురించి వివరించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ప్రజలకు మోసపోయిన విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటకోట నాగరాజు, రాము మాస్టారు, ఒమ్మి చిన్నారావు, కాంగ్రేగుల నాయుడు, పెంటకోట బాబూరావు, కనుకులు, పిలక మోహన్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ప్రమాదంలో గాయపడిన విష్ణుయాదవ్ డిశ్చార్జి



రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ రాధాకృష్ణన్

**మహారాణిపేట:** కదులుతున్న రైలు నుంచి ప్రమాదశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డ విష్ణుయాదవ్ (26)ను వైద్య సేవలు అందించి శుక్రవారం కేజీహెచ్ వైద్యులు డిశ్చార్జి చేశారు. గత నెల 27న కరకవలస వద్ద కదులుతున్న రైలు నుంచి విష్ణుయాదవ్ జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో అతని ఎడమ చేయి భుజం వరకు తెగి శరీరం నుంచి వేరు పడింది. స్పృహ లేని స్థితిలో ఉన్న యాదవ్‌ను కేజీహెచ్ అత్యవసర విభాగంలో చేర్పించారు. షాక్ నుంచి కోలుకోవడానికి వైద్య సేవలు అందించి, అనంతరం రక్తం ఎక్కించి శస్త్ర చికిత్స నిర్వహించారు. మత్తు, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలు సంయుక్తంగా శస్త్ర చికిత్స చేసి రోగి త్వరగా కోలుకునే విధంగా వైద్య సేవలు అందించారు. శుక్రవారం కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణన్ రోగిని పరామర్శించారు. విష్ణుయాదవ్ ఆరోగ్యంగా ఉండడంతో శుక్రవారం డిశ్చార్జి చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. రోగి, వారి బంధువులు వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## పరిశుభ్రతతో వ్యాధులకు చెక్



ఫ్రైడే–డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

**సింధియా:** పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చని మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డులో శుక్రవారం డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైడే–ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన పాత్రలను ఖాళీ చేయాలని సూచించారు. వ్యర్థాలను తడి–పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. దోమల నియంత్రణ కోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 62వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్ గంట్యాడ గోవింద్, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.

## అంధకారంలో వెంకటేశ్వరమెట్ట



వీధి దీపాలు వెలగక చీకటిగా ఉన్న వెంకటేశ్వరమెట్టలోని ఒక వీధి

**అల్లిపురం:** వారం రోజులుగా వెంకటేశ్వమెట్ట గ్రంథాలయం నుండి మూడుగుళ్ల జంక్షన్ వరకు అంధకారం అలుముకుని ఉంది. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 11బి/5 నుంచి 11బి/9 వరకు వీధి దీపాలు వెలగకపోవటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయం వద్ద జీవీఎంసీ పనులు చేపడుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా తెల్లవారు జాము 4 గంటల నుండి మంచినీటిని వదులుతుండటంతో చీకటిలో మహిళలు నీటిని పట్టుకునేందుకు అవస్థలు పడుతున్నారని స్థానికులు తెలిపారు. తెల్లవారుజామున చీకటిని అవకాశంగా తీసుకుని దొంగలు ఎవరైనా మహిళలపై దాడులకు పాల్పడే అవకాశం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ఎట్టకేలకు శ్రీనగర్ రోడ్డుకు మోక్షం



శ్రీనగర్ రోడ్డు పునర్నిర్మాణ పనులు

**సీతంపేట:** జీవీఎంసీ 27వ వార్డులోని వీటీ హైస్కూల్ సమీపంలో శ్రీనగర్ రోడ్డును ఎట్టకేలకు పునర్నిస్తున్నారు. రామాటాకీస్ రహదారి నుంచి ద్వారకా నగర్‌కు వెళ్లే శ్రీనగర్ రోడ్డు గోతులతో రాళ్లు తేలి అధ్వానంగా మారింది. చాలా కాలంగా వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో రహదారులను బాగు చేస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. శ్రీనగర్ రోడ్డులో జనం పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయ్యాక ఈ రహదారికి మోక్షం కలిగింది. రెండు రోజులుగా శ్రీనగర్ రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డాక్‌యార్డ్ కేటీబీ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

**విశాఖ విద్య:** డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గంట్ల శ్రీనుబాబు, అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల చిరంజీవి, విజనగిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరోతి వెంకటేష్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా యాతము రాజ్ కుమార్, కోశాధికారిగా గనిరెడ్డి శ్రీనివాస్‌తో కలిపి మొత్తం 27 మంది నూతన కార్యవర్గంలో ఎన్నికయ్యారు. సంఘ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్‌లోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం తొలిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శ్రీనుబాబు,అధ్యక్షుడు బత్తుల చిరంజీవి మాట్లాడుతూ రక్షణ రంగంలో సేవ చేసే అవకాశం లభించడం ప్రతి ఒక్కరూ పూర్వ జన్మ సుకృతంగా భావించాలన్నారు. అందరి సహకారంతో కేటీబీ కళాక్షేత్రాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చుకోగలిగామన్నారు. అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి (సభ్యుల) తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. మూడేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. పలువురి సీనియర్లను సలహాదారులుగా, కొందరు న్యాయవాదులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులంతా అభినందనలు తెలియజేశారు.

## బ్రహ్మకుమారీస్ కేంద్రం ప్రారంభం



కార్పొరేటర్ వెంకటరమేష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ అక్కయ్య

**గోపాలపట్నం:** జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీలో బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్‌ను శుక్రవారం ఆ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ప్రారంభించారు. మెడిటేషన్ సెటర్ ఈ ప్రాంతంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆయనకు రాఖీకట్టారు. కార్యక్రమంలో శరగడం సురేష్, బొడ్డేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌టీఎల్‌తో అనిట్స్ భాగస్వామ్యం



ఎన్ఎస్‌టీఎల్ అధికారులతో సమావేశమైన అనిట్స్ ప్రొఫెసర్లు

**తగరపువలస:** విశాఖ ఎన్ఎస్‌టీఎల్‌తో సమష్టిగా పని చేస్తూ నీటి అడుగున ఆయుధాలు, వాటి అనుబంధ వ్యవస్థలపై పరిశోధన చేసేందుకు సంగివలస అనిట్స్‌కు చెందిన 12 మంది ప్రొఫెసర్లకు అవకాశం కలిగింది. ఈ సందర్భంగా శుక్రవారం అనిట్స్ బృందం ఎన్ఎస్‌టీఎల్‌లోని ప్రయోగశాలలను సందర్శించింది. ప్రయోగశాల డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ రక్షణరంగ పరిశోధన, అభివృద్ధి గురించి అక్టోబర్ 3వ వారంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శాస్త్రజ్ఞుల అంతర్గత సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రయోగశాల అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ఎన్ దాస్, సీనియర్ శాస్త్రవేత్తలు సాజీ, వేణుగోపాలరావు పలు అంశాలను వివరించారు. ఈ బృందానికి అనిట్స్ డైరెక్టర్ కె.శ్రీరామకృష్ణ నాయకత్వం వహించారు.

## ఉత్సాహంగా ఏయూ ఉద్యోగుల క్రికెట్ పోటీలు



సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న సీఏవో జట్టు

**మద్దిలపాలెం:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులకు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు నాలుగు జట్ల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. సీఏ వో–1 జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆ టీం ప్లేయర్ గోవింద అత్యధికంగా 44 పరుగులు సాధించారు. శనివారం జరిగే పోటీల్లో 6 జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు వెంకటాద్రి, సిద్ధయ్య హాజరు కానున్నారు. పోటీల నిర్వాహకులుగా దువ్వి గోవింద, డి.శ్రీనివాసరావు, కోనా పోలారావు, కర్రి శ్రీనివాస్ వ్యవహరించారు. ఖాదర్‌బాబా, ఈశ్వరరావులు ఆసక్తికరమైన వ్యాఖ్యానంతో మ్యాచ్‌లను రక్తికట్టించారు.